క్లుప్తంగా

గ్రామ కమిటీల ఎంపిక పూర్తి

జే.పంగులూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీలు,గ్రామ కమిటీలు నియమిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ స్వయంపు హనుమంతురావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మండల పరిధిలోని నార్నెవారిపాలెంలో ఆరుగురు సభ్యులతో కూడిన గ్రామ కమిటీలను నియమించినట్లు తెలిపారు. గుంటుపల్లి రాజశేఖర్ కమిటీలో అధ్యక్షుడిగా, నార్నె రత్తయ్య, అమర్తలూరి రాముడు, రాచగిరి మోహన్‌రావు, చింతల చెరువు విజయ్ కుమార్, పూర్ణగంటి శ్రీను సభ్యులుగా వ్యవహరిస్తారని తెలిపారు. ఆదే గ్రామానికి చెందిన చింతల చెరువు యోహాన్ మండల కమిటీలో తీసుకున్నట్లు తెలిపారు. గ్రామ కమిటీ, మండల కమిటీలు రాబోవు ఎన్నికలలో పార్టీ గెలుపు కోసం కృషిచేస్తాయని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో కమిటీలను నియమిస్తామని తెలిపారు.

నేడు పంచాయతీ కార్యదర్శుల సమావేశం

చీరాల టౌన్: మండలంలోని అన్నీ గ్రామపంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లతో సోమవారం సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపీడీవో ఎం.శోభారాణి తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ హాలులో నిర్వహించే సమావేశానికి హాజరయ్యే పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లు విధిగా గ్రామ పంచాయతీలు, సచివాలయాల సమాచారం, అభివృద్ధి పనులు, నిధుల వివరాలతో విధిగా హాజరు కావాలని ఎంపీడీవో సూచించారు.

బల్లికురవలో రేపు జేఏఎస్ క్యాంపు

బల్లికురవ: బల్లికురవలో మంగళవారం జగనన్న ఆరోగ్యసురక్ష రెండో విడత క్యాంపు నిర్వహిస్తున్నట్లు గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ రమీజ్ అహమ్మద్ ఆదివారం తెలిపారు. మొదటి విడతలో చూపించుకున్నవారు కేస్ షీట్‌లతో శిబిరానికి హాజరుకావాలని, బల్లికురవతో పాటు సచివాలయం పరిధిలోని కొండాయపాలెం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు

స్వర్ణలో జూదరుల అరెస్టు

కారంచేడు: మండలంలోని స్వర్ణ గ్రామంలో పేకాడుతున్న ఏడుగురిని కారంచేడు పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం గ్రామశివారులోని పొలాల వద్ద కొంత మంది పేకాడుతున్నట్లు వచ్చిన సమాచారంతో ఎస్‌ఐ కే సురేష్ తన సిబ్బందితో కలసి దాడి చేశారు. దీంతో అక్కడ పేడాడుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకోగా వారి వద్ద ఉన్న రూ.1750 నగదును కూడా స్వాధీనం చేసుకున్నారు. వీరిని కోర్టుకు హాజరుపరుస్తామన్నారు. ఎక్కడైనా ఇలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగితే వెంటనే తమకు తెలపాలని ఆయన కోరారు.

పంటల నమోదుకు నేడు గడువు ముగింపు

మార్టూరు: రబీ సీజన్‌లో పంటలు సాగు చేస్తున్న రైతులు తమ పంటల వివరాల నమోదుకు నేటితో గడువు ముగియనున్నట్లు మండల వ్యవసాయ అధికారి వి. కిరణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఇప్పటివరకు 10,032 ఎకరాల పంటల నమోదును సంబంధిత రైతులు చేసినట్లు ఆయన తెలిపారు. ఇంకా పంటలు నమోదు చేసుకోవాల్సిన రైతులు తమ తమ స్థానిక రైతు భరోసా కేంద్రాలలో సోమవారం సాయంత్రం లోపు నమోదు చేపుకోవాలని తెలిపారు. పంటల నమోదు పూర్తి చేసిన రైతులు ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఆయన తెలిపారు. అప్పుడే వారికి ప్రభుత్వం రైతులకు అందిస్తున్న ఉచిత పంటల బీమా, ఇనుపుట్ సబ్సిడీ, మద్దతు ధర తదితర సంక్షేమ పథకాలు రైతులకు వర్తిస్తాయని తప్పనిసరిగా పంటల నమోదు, ఈ-కేవైసీ చేయించుకోవాలని ఏవో కిరణ్‌కుమార్ తెలిపారు.

ఇంటింటికీ వైద్యంతో ఉపయోగాలు



బల్లికురవ: జలుబు, దగ్గు జ్వరంతో బాధపడుతూ ఉంటే వైద్యశాలలకు వచ్చి చికిత్స చేయించుకోవాలని.. ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లి డబ్బు ఖర్చు చేసుకోవద్దని గుంటుల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ రమీజ్ అహమ్మద్ తెలిపారు. ఆదివారం కొణిదెన గ్రామంలోని ఎస్సీ కాలనీలో వైద్య ఆరోగ్యశాఖచే ఇంటింటా సర్వే చేపట్టారు ఆరుగురి రక్త నమూనాలు సేకరించారు. నెలరోజులుగా గ్రామం ఎస్సీ కాలనీలో సిబ్బంది, సర్వేతో జ్వరపీడితుల రక్తనమూనాలు సేకరించి పరీక్షలతో జ్వరాలను అదుపులోకి తెచ్చామని వైద్యాధికారి వివరించారు. 104 క్యాంపులు జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు, హైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లతో ప్రభుత్వం పేదలు వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చిందని చెప్పారు. సోమవారం ఎస్సీ కాలనీలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి కోరారు. ఈపరీక్షలలో ల్యాబ్ టెక్నీషియన్ వెంకట్, ఏఎస్ఎం నూర్జహాన్, ఎంఎల్‌హెచ్‌పీ కోటేశ్వరమ్మ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



గొట్టిపాటి భరత్‌ను కలిసిన సమన్వయకర్త యడం బాలాజీ



యడం బాలాజీని అభినందిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు రజనీ

● నియోజకవర్గ సమన్వయకర్త యడం బాలాజీ

యద్దనపూడి: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పర్చూరు నియోజకవర్గ సమన్వకర్త యడం బాలాజీ అన్నారు. ఆదివారం రాత్రి చిలకలూరిపేటలోని గొట్టిపాటి భరత్ ఇంటి వద్ద కలిసి ఆయన సహకారం కోరారు. ఈ సందర్భంగా ఇరువురు నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఈ సందర్భంగా మార్టూరు, యద్దనపూడి మండలాలకు చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులను భరత్ బాలాజీకి పరిచయం చేశారు. ఈ సందర్భంగా యడం బాలాజీ మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంగా పనిచేయాలని సూచించారు. మనకు కేవలం 50 రోజులు మాత్రమే సమయం ఉందని చిన్నచిన్న బేధాభిప్రాయాలను పక్కనపెట్టి పార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు. పర్చూరు గడ్డపై వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసేందుకు తన సాయశక్తుల కృషి చేస్తానని, అందుకు మీరందరూ సహకరించాలని కోరారు. ప్రతి సామాన్య కార్యకర్తకు సైతం అందుబాటులోనే ఉంటానని తనను గెలిపిస్తే ఐదేళ్ల పాటు మీకు సేవ చేసే అవకాశం దక్కుతుందని వారికి సూచించారు. కార్యక్రమంలో మార్టూరు, యద్దనపూడి మండలాల్లోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

బాలాజీని కలిసిన కారంచేడు జెడ్పీటీసీ..

కారంచేడు: వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్తగా నూతనంగా నియమితులైన యడం బాలాజీని కారంచేడు జెడ్పీటీసీ సభ్యురాలు యార్లగడ్డ రజనీశ్రీనివాసరావు కలసి అభినందనలు తెలిపారు. ఆదివారం బాలాజీ స్వగృహంలో కలిశారు. మండలంలోని పార్టీ పటిష్టతకు అన్ని స్థాయిల నాయకులు, కార్యకర్తలతో కలిసి పనిచేసి పార్టీని మరింత బలపరిచేలా ప్రణాళికను బట్టి కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో చీరాల మాజీ కార్పొరేటర్ ఆదిలక్ష్మి, పత్తిపాటి శివన్నారాయణ, యార్లగడ్డ శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

బాలాజీకి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

ఇంకొల్లు (చినగంజాం): పర్చూరు నియోజక వర్గానికి నూతనంగా సమన్వయకర్తగా నియమితులైన



యడం బాలాజీని కలిసిన ఇంకొల్లు నాయకులు

యడం బాలాజీని చీరాలలోని ఆయన స్వగృహంలో ఆదివారం నియోజక వర్గానికి చెందిన పలువురు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో అన్ని వేళలా పార్టీకి అండగా ఉంటామని ఆయనకు తెలిపారు. ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో బాపట్ల జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి షేక్ బాబుల్లా, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు చిన్ని పూర్ణారావు, ఇంకొల్లు మండల ప్రచార కమిటీ అధ్యక్షుడు అమ్మిశెట్టి శ్రీనివాసరావు, మండల బూత్ కన్వీనర్ సయ్యద్ సుభాని, ఉసురుపాటి చిన్న, షంషుద్దీన్ తదితరులున్నారు.

దత్తపాదుకా క్షేత్రంలో నాయకుల ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న కరణం బలరాం, హనిమిరెడ్డి, వైవీ భద్రారెడ్డి, వెంకారెడ్డి

అద్దంకి: పట్టణంలోని ధన్వంతరీ దత్తపాదుకా క్షేత్రంలో చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ వైవీ భద్రారెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు మారం వెంకారెడ్డి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. మైసూరు దత్తపీఠం నుంచి వచ్చిన దత్త పీఠ ఉత్తరాధికారి విజయానంద తీర్థ స్వామీజీ వారిని నాయకులను ఆశీర్వదించి తీర్థప్రాదాలు అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగసూరి హనుమత్ ప్రసాద్ నాయకులను సాదరంగా ఆహ్వానించి ప్రత్యేక పూజలు చేయించారు. పూజల్లో ధర్మవరపు శ్రావణ్‌కుమార్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కూరపాటి రామకోటేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ దేపు పద్మేశ్, కౌన్సిలర్లు సుధీర్, బాలూ, రత్నకుమారి, గుంటూరు విజయలక్ష్మి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రోజూ నడక ఆరోగ్యానికి బాట



2-కే వాక్ నిర్వహిస్తున్న రోటరీ, వాకర్స్ సభ్యులు

● రోటరీ క్లబ్, ఐకాన్ హాస్పిటల్ సంయుక్తంగా 2-కే వాక్

చీరాల అర్బన్: రోజూ ఉదయం, సాయంత్రం నడవడం వలన అనారోగ్య సమస్యలను నివారించవచ్చని ఐకాన్ హాస్పిటల్ అధినేత డాక్టర్ శంకరశెట్టి కొండలరావు అన్నారు. రోటరీ క్లబ్, ఐకాన్ హాస్పిటల్ సంయుక్తంగా ఆదివారం మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. అలానే రోటరీ సభ్యులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పట్టణ వీధులలో 2-కే వాక్‌ను నిర్వహించారు. రోజూ నడక మంచి అలవాటు, 'నడవండి-నడిపించండి' అంటూ నినాదాలు చేశారు. అనంతరం రోటరీ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మెగా మెడికల్ క్యాంపును ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ డాక్టర్ శరత్‌బాబు ప్రారంభించారు. శిబిరంలో రూ.5 వేలు విలువ చేసే పరీక్షలను 200 మందికి ఉచితంగా నిర్వహించి మందులు ఉచితంగా అందించారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, అధిక బరువుతో ఎన్నో జబ్బులకు దారితీస్తుందని అన్నారు. శరీర బరువు అదుపులో ఉంటే అన్ని అదుపులో ఉంటాయన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి మితాహారాన్ని తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు మామిడాల శ్రీనివాసరావు, చీరాల కృష్ణమూర్తి, పోలుదాసు రామకృష్ణ, డాక్టర్ ఐ.బాబూరావు, జీవై ప్రసాద్, గుర్రం రాఘవరావు, డివి సురేష్, చారుగుళ్ల గురుప్రసాద్, పుల్లయ్యానాయుడు, బాలవెంకటేశ్వరరావు, హరినారాయణ, బదరినాథ్, హేమంత్‌కుమార్, శంకరరెడ్డి, మూర్తి హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం



మాట్లాడుతున్న చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి



మాట్లాడుతున్న సమన్వయకర్త చిన హనిమిరెడ్డి

● నియోజకవర్గ సమన్వయకర్త చిన హనిమిరెడ్డి
● ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న చీరాల ఎమ్మెల్యే కరణం, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ భద్రారెడ్డి

అద్దంకి రూరల్: ఆర్యవైశ్యులకు తాను అండగా ఉంటానని అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక వాసవీ కన్యాకాపరమేశ్వరీ అమ్మవారి దేవస్థానం వద్ద ఆర్యవైశ్య సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం హనిమిరెడ్డి మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు వ్యాపారాలపై ఎటువంటి దాడులు జరగకుండా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. గతంలో గెలిచిన ఎమ్మెల్యే ఏమీ చేశాడో తెలియదుకాని తనకు ఒక్కఅవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. చీరాల ఎమ్మెల్యేకరణం బలరామ కృష్ణమూర్తి మాట్లాడుతూ అద్దంకి అభివృద్ధిలో తనపాత్ర ఎంత ఉందో అందరికీ తెలుసునన్నారు. తాను మొదటిసారి రూ.25 వేలతో ఎన్నికల్లో నిలబడ్డానని ఇప్పుడు ఎన్నికల వ్యయం బాగా పెరిగిందని గుర్తుచేశారు. ప్రస్తుత ఎమ్మెల్యేతో చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. నక్కజిత్తులతో మాయ చేస్తాడన్నారు. గతంలో నమ్మారు.. ఇప్పుడు మాత్రం నమ్మవద్దని మంచివాడైన పానెం హనిమిరెడ్డి గెలిపించాలని కోరారు. హనిమిరెడ్డి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆశీస్సులతో పాటు నా సహాయ సహకారాలు కూడా ఉంటాయని పేర్కొన్నారు. మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ వైవీ భద్రరెడ్డి మాట్లాడుతూ పానెం హనమిరెడ్డికి బలరాం, వైవీ సుబ్బారెడ్డి ఆశీస్సులు ఉంటాయన్నారు. అత్యధిక మెజారిటీతో హనిమిరెడ్డిని గెలిపించి సీఎం జగన్ మోహన్‌రెడ్డికి బహుమతిగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు మారం వెంకరారెడ్డి, వైస్ చైర్మన్ దేసుపద్మేష్, శింగరకొండ ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ కోట శ్రీనివాసకుమార్, చిన్ని శ్రీమన్నారాయణ, కె.కుసుమలత, మారం రామకోటేశ్వరరావు, గుంటూరు మాధవరావు, ఉడత్తుసురేష్, ఆర్యవైశ్య నాయకులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ కార్యాలయ భవనాల ప్రారంభం





గుంటుపల్లిలో ప్రారంభానికి సిద్ధమైన సచివాలయం, ఆర్బీకే

● ప్రారంభ వేడుకల్లో పాల్గొననున్న బాపట్ల ఎంపీ నందిగం సురేష్, సమన్వయకర్త చిన హనిమిరెడ్డి

బల్లికురవ: మండలంలోని గుంటుపల్లి, వల్లాపల్లి గ్రామాల్లో సోమవారం సాయంత్రం సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, సీసీ రోడ్డు, డ్రెయిన్స్, ప్రారంభిస్తున్నట్లు ఆగ్రామాల సర్పంచ్‌లు మాదాల కృష్ణకుమారి, మందా మోహన్ రావు ఆదివారం తెలిపారు. గుంటుపల్లిలో రూ.68 లక్షలతో నిర్మించిన సచివాలయం, ఆర్బీకే, బాపట్ల ఎంపీ నందిగం సురేష్ నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన సీసీరోడ్డు డ్రెయిన్‌లు వల్లాపల్లిలో రూ.68 లక్షలతో నిర్మించిన సచివాలయం ఆర్‌బీకే, రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీ నందిగం సురేష్, అద్దంకి వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి, ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. మండలస్థాయి అధికారులు గ్రామాల్లోని సర్పంచ్‌లు ఎంపీటీసీలు, స్థానిక నేతలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కఠోర సాధనతో ఉన్నత లక్ష్యాలు



మాట్లాడుతున్న డీసీఆర్బీ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ అల్లాడి దేవకుమార్

చీరాల రూరల్: కఠోర సాధన చేయడం ద్వారా ఉన్నత లక్ష్యాలు చేరుకుంటారని డీసీఆర్బీ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ అల్లాడి దేవకుమార్ అన్నారు. గత 45 రోజులుగా స్థానిక సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కళాశాలలో డీసీఆర్బీ, ప్రజా సంఘాలు, కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రూప్-2 శిక్షణా తరగతులు ఆదివారంతో ముగిశాయి. ఈముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా అల్లాడి దేవకుమార్ పాల్గొని శిక్షణా తరగతులకు హాజరైన అభ్యర్థులనుద్దేశించి మాట్లాడారు. ఎంతో వ్యయంతో ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను అభ్యర్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. అలానే శిక్షణ తరగతులును ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి నిర్వహించిన నిర్వహకులను ఆయన అభినందించారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలలో రెండు శాతం మాత్రమే ఉపాధి అవకాశాలు కల్పించబడుతున్నాయని ఎంతో కఠోర శిక్షణతో నిబద్ధతతో చదువుకుంటేనే ఉద్యోగ అవకాశాలు వస్తాయని చెప్పారు. గ్రూప్-1 అధికారి రాయుడు రవికుమార్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతను దృష్టిలో పెట్టుకుని ఇటువంటి శిక్షణ తరగతులు నిర్వహించడం మంచి పరిణామమని చెప్పారు. ఎయిడెడ్ కళాశాలల రాష్ట్ర అధ్యక్షుడు గారపాటి పుష్పరాజు మాట్లాడుతూ ఈనెల 25న నిర్వహిస్తున్న ప్రిలిమ్స్ పరిక్షలలో అందరూ విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు. శిక్షణ తరగతులు నిర్వహకులు పి. జయశీలరావు అధ్యక్షత వహించి, కార్యక్రమంలో డీసీఆర్బీ కోఆర్డినేటర్ భగవాన్ దాసు, ఎస్. బాబురావు, ఎజ్రా, వి. ఐజాక్, డేవిడ్, కళాశాల అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, ఉత్తరాయనం, మాఘమాసం మృగశిర, నక్షత్రం దశమి తిథి, సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర ఆదివారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు

కారంచేడు: గ్రామ దేవత గంగమ్మతల్లికి గ్రామస్తులు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి మండల కేంద్రమైన కారంచేడు పుట్టాయిపాలెంలో కొలువైన గంగమ్మ తల్లికి గ్రామ ఆడపడుచులు పొంగళ్లు సమర్పించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి నైవేద్యాలు, పొంగళ్లు సమర్పించారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరొందిన అమ్మవారిని దర్శించుకోవడానికి గ్రామ ఆడపడుచులతో పాటు, గ్రామస్తులు, పర్చూరు, ఇంకొల్లు మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థ, ప్రసాదాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.



కారంచేడులో ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

ఘనంగా సిగ్నల్ కోర్ డే



సిగ్నల్ కోర్ డేలో పాల్గొన్న మాజీసైనికులు

బేస్తవారిపేట: కంభంలోని మాజీ సైనికుల సంక్షేమ సంఘం కార్యాలయంలో 114వ సిగ్నల్ కోర్ డే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. సిగ్నల్ కోర్ సైనికులు, మాజీ సైనికులు ఒకరిని ఒకరు పరిచయం చేసుకున్నారు. సీనియర్ సిగ్నల్ కోర్ మాజీ సైనికులను శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు సహకరించాలని కోరారు.

గిద్దలూరులో..

గిద్దలూరు పీఆర్ కాలనీలోని సంజీవిని అనాథ వృద్ధాశ్రమంలో సిగ్నల్ కోర్ డే సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వృద్ధులు, పిల్లలకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. అనాథాశ్రమం నిర్వహణకు సహకారం ఇస్తామని పలువురు మాజీ సైనికులు తెలిపారు.

నేడు పోలూరులో ధ్వజస్తంభ పునఃప్రతిష్ట

యద్దనపూడి: మండలంలోని పోలూరు గ్రామంలో వేంచేసి ఉన్న భూ, నీలా సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో సోమవారం ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ జరుగుతున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.39 నిముషాలకు ప్రతిష్ఠ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఉదయం 11 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. పరిసర గ్రామాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం చిలకలూరిపేట, పర్చూరు నుంచి ప్రతి గంటకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేశామని చెప్పారు. భక్తులు ఈ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

రౌడీషీటర్ల నడవడికలో మార్పురావాలి



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై సురేష్

వేటపాలెం: పోలీసుల రికార్డుల్లో రౌడీషీటర్లుగా పేర్లు నమోదైన వారి ప్రవర్తనలో మార్పు రావాలని ఎస్సై జి సురేష్ తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. నేర ప్రవృత్తిని వీడి మంచి పౌరులుగా మారాలని సూచించారు. రౌడీషీటర్లుగా పేర్లు నమోదు కాబడిన వారి ప్రవర్తనపై ఎప్పుడు పోలీసు నిఘా ఉంటుందని గుర్తుంచుకోవాలన్నారు. సమాజంలో మంచిగా బతికి కుటుంబాలను పోషించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.